నేడు అన్న క్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - సాలూరు

నిరుపేదలకు అతి తక్కువ ధరకు భోజనం పంపిణీ చేసే అన్నా క్యాంటీన్ నిర్మాణానికి బుధవారం గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి శంఖుస్థాపన చేయనున్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న 162/2 సర్వే నెంబర్ స్థలంలో అన్నా క్యాంటీన్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.60లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ క్యాంటీన్ రెండు నెలల్లో అందుబాటులోకి రానుంది.

సర్దు 'పోటు'పై ఉపాధ్యాయుల ఆగ్రహం

సర్దుబాటు పై నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు (ఫైల్)

- జిల్లాలో 613మంది మిగులు ఉపాధ్యాయులు
- సర్దుబాటు నిర్ణయాన్ని విరమించుకోవాలంటున్న ప్యాప్టో

ప్రజాశక్తి- పార్వతీపురం

ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నారు. పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను వేరే పాఠశాలలో సర్దుబాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా సర్దుబాటు కౌన్సిలింగ్‌ను బహిష్కరించి నిరసన తెలిపారు. విద్యా సంవత్సరం మధ్యలో సర్దుబాటు చేయడం సరికాదని, వెంటనే విరమించుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ పాఠశాల విద్యాశాఖ చేపడుతోంది. ఆగస్టు 9వ తేదీ వరకు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు ఉత్తర్వులుజారీ చేసింది. అదే రోజు విద్యాశాఖ నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో సమస్యల గురించి ఉపాధ్యాయ సంఘాలు ప్రస్తావించినప్పటికీ వీటిని పరిగణలోకి తీసుకోకుండా ఉపాధ్యాయుల సీనియార్టీ అనే ఒక చిన్న డిమాండ్ మాత్రమే పరిగణనలోకి తీసుకుని జిఒ 117, 128 ఆధారంగా పనిసర్దుబాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ సర్దుబాటు వలన సుమారుగా స్కూల్ అసిస్టెంట్‌లు 176 మంది, ఎస్‌జిటిలు సుమారు437 మంది వరకు వేరే పాఠశాలలకు తప్పని పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తోంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 98 మంది విద్యార్థులకు మించి ఉంటే అక్కడికి స్కూలు అసిస్టెంట్లను సర్దుబాటు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 154 పోస్టులను సర్దుబాటు చేయాల్సి ఉండగా, 613మంది ఉపాధ్యాయులను మిగులుగా చూపారు. అయితే పని సర్దుబాటు ప్రక్రియ చేసేటప్పుడు కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనీ ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ప్రధానంగా జిఒ 117, 128 ద్వారా కాకుండా 2020లో విడుదల చేసిన జిఒ 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని కోరుతున్నారు.

విద్యా సంవత్సరం మధ్యలో చేయడం వలన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇద్దరికీ నష్టం జరిగే అవకాశం ఉంది. ఉపాధ్యాయ బదిలీలు జరిగి ఏడాది అయ్యింది. తాజాగా సర్దుబాటు చేయడం వల్ల విద్యార్థులకు బోధనలో నష్టం జరిగే అవకాశం ఉంది. కావున వెంటనే సర్దుబాటు ప్రక్రియను ఆపాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సర్దుబాటుపై ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయం

పని సర్దుబాటు ప్రక్రియలో సీనియర్‌కు విల్లింగ్ అవకాశం కల్పించాలనీ, సీనియార్టీని లెక్కించినప్పుడు ప్యానల్ నంబర్ లేదా ర్యాంకును పరిగణనలోకి తీసుకోవాలని, పని సర్దుబాటు ప్రక్రియ మండల, డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. పని సర్దుబాటు చేసినప్పుడు ఉపాధ్యాయుడి సొంత మేనేజ్‌మెంట్‌లో గల ఖాళీలలో భర్తీ చేసిన తర్వాతే ఇతర మేనేజ్‌మెంట్లలో నియమించాలి. 70శాతం పైబడి అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులను పనిసర్దుబాటు ప్రక్రియ నుండి మినహాయించాలని, 2025 ఏప్రిల్ 30లోపు ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులను వారి పోస్టులను పని సర్దుబాటు నుండి మినహాయించాలని కోరుతున్నారు. ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలని, 6 నుండి 10 తరగతులు 10 సెక్షన్లు దాటిన సందర్భంలో 2వ హిందీ, 2వ పిఎస్ పోస్టులను కేటాయించాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో జిఒ 60 మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలని కోరుతున్నాయి. అవసరాన్ని బట్టి మాత్రమే మిగులు నిర్ణయించి సర్దుబాటు ప్రక్రియ చేయాలని, ప్రాధాన్యత కేటగిరీ కింద బదిలీ పొందిన వారికి డివిజన్ స్థాయి సర్దుబాటు నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నాయి. స్టడీ లీవ్, మెటర్నిటి లీవు తదితర దీర్ఘకాల సెలవులో ఉన్న ఉపాధ్యాయులు ఉన్న చోట పని సర్దుబాటు నుండి మినహాయింపు ఇవ్వాలని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా మాత్రమే ఎసి (పిఇ), పిఇటిలను అదే మండలంలో పని సర్దుబాటు చేయాలని, ప్లస్ టూ, సిబిఎస్‌సి పాఠశాలల్లో పని సర్దుబాటును నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

సిగ్నల్స్ అందక అవస్థలు

అత్యవసర సమయంలో సమాచారమందక ఇక్కట్లు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రస్తుతం హైటెక్ యుగంలో మానవుడు పరుగులు పెడుతున్న ప్రస్తుత తరుణంలో పలు మారుమూల ప్రాంతాలకు సెల్ సిగ్నల్ అందక గిరిజనులు అవస్థలుపడుతున్నారు. మండలంలోని ఏజెన్సీలో టవర్ పనులు పూర్తికాక సిగ్నల్స్ అందక టవర్లు సిగ్నల్స్ లేక గిరిజనులు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వాలు మారిన పరిపాలన ఒకటే చందంగా మారింది. ఏజెన్సీలో ఫోను రావాలంటే సిగ్నల్స్ ఉన్నచోట దగ్గరికి వెళ్లి కొండ శివారు ప్రాంతానికి ఫోన్ ద్వారా మాట్లాడి తిరిగి కొండ దిగి ఇంటికి వస్తున్నాను. తిరిగి మళ్లీ అత్యవసర సమయంలో ఫోను రాదు సెల్‌ఫోన్లు పట్టుకొని సిగ్నల్స్ దగ్గరికి లేక పట్టణాలకు వస్తే తప్ప ఫోన్లు మోగవు. ఏజెన్సీలో ఫోన్లో సెల్ఫోన్లో మూగనోముగా ఉంటాయి. సిగ్నల్ కోసం గిరిజనులు గంటల తరబడి నిరీక్షిస్తుంటారు. ప్రతి పనికి సిగ్నల్‌తో ముడిపడి ఉంది. పెన్షన్ అందుకోవాలన్నా, రేషన్ తీసుకోవాలన్నా సిగ్నల్స్ ఉన్నచోటకు పరుగులు తీయాల్సిందే. మండలంలోని దోనుబాయి, మర్రిపాడు ప్రాంతాల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేసినప్పటికీ ఆ పరిసర ప్రాంతాల్లో మాత్రమే సిగ్నల్స్ వస్తుంది. సెల్ టవర్ ఫ్రీక్వెన్సీ తక్కువ

సిగ్నల్స్ కోసం ఎదురుచూస్తున్న గిరిజనులు

ఉన్నట్లు చుట్టుపక్కల గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం అప్పటి ఐటిడిఎ పిఒ నవ్య 44 బిఎస్ఎన్ఎల్ టవర్లకు ప్రతిపాదనలు పంపించారు. ఇందులో సీతంపేట ఏజెన్సీలో 26 సెల్ టవర్లు కేటాయించారు. ప్రస్తుతం ఆ పనులు కొనసాగుతున్నాయి. అత్యవసర సమయంలో అంబులెన్స్ లేక అగ్నిమాపక శకటం ఇతర ఏదైనా అత్యవసర సమయంలో ఫోను చేయాలంటే సెల్ టవర్లు ఉంటేనే సిగ్నల్స్ ఉంటాయి. అప్పుడే ప్రజలకు ఉపయోగపడుతుంది.

దీనిపై బిఎస్ఎన్ఎల్ ఎజిఎం డి.పాపారావు మాట్లాడుతూ 44 సెల్ టవర్లకు గానూ ఇప్పటికీ 17 పూర్తయ్యాయని, వీటిని ఈనెలాఖరుకు పూర్తవుతాయని తెలిపారు.

సెల్ టవర్లు పనులు పూర్తి చేయాలి

ఏజెన్సీలో సిగ్నల్స్ అందక గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారు. వెంటనే సెల్ టవర్లు పనులు పూర్తి చేసి సిగ్నల్స్ అందించాలి. ఇప్పటికీ రెండు, మూడేళ్లలో పనులు ఇంకా పూర్తి కాలేదు. వెంటనే పూర్తి చేయాలి.

ఆరిక భాస్కరరావు,
సిపిఎం మండల కార్యదర్శి, సీతంపేట.

రోడ్లపైనే గజరాజులు

వంగర : అటవీ ప్రాంతంలో సంచరించాల్సిన గజరాజులు గ్రామాలలో రోడ్ల పై సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నెల 11న వంగర మండలం వివిఆర్‌పేటలోకి ప్రవేశించిన గజరాజుల గుంపు ఆ పరిసర ప్రాంతంలోనే ఉండి మంగళవారం ఉదయం వివిఆర్ పేట రాజులు గుమ్మడ ప్రధాన రహదారిపై సంచరించాయి. ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి అడ్డంగా ఉండటంతో ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలిగింది. కొంత సమయం తర్వాత అవి పొలాల్లోకి వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలాల్లోకి వెళ్లిన ఏనుగులు మొక్కజొన్న, చెరకు, అరటి తోటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

కార్మికశాఖ అధికారి చర్చల్లో పాల్గొన్న కాంట్రాక్టు , ఔట్‌సోర్సింగ్ కార్మికులు, నాయకులు

చర్చలకు కాంట్రాక్టర్ గైర్హాజరు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక ఆర్‌టిసి డిపో పరిధిలోని కాంట్రాక్ట్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు, ఆర్టీసీ అధికారులతో మంగళవారం జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో జరగాల్సిన జాయింట్ మీటింగ్ చర్చలకు కాంట్రాక్టర్ గైర్హాజరు కావడంతో చర్చలు ఈనెల 21 నాటికి వాయిదా పడినట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు, నాయకులు తులసీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌తో జరిగిన చర్చల సందర్భంగా ఆర్టీసీ ఔట్సోర్సింగ్ కార్మికులకు చట్ట ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, పండగ సెలవులు ఇవ్వాలని, కార్మికులు కాంట్రాక్టర్‌తో దీన్ని అమలు చేయించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకునేలా కార్మిక శాఖ అధికారులు పర్యవేక్షించాలని కోరామన్నారు. గతంలో జరిగిన షరతుల ప్రకారం కాంట్రాక్టర్ను తీసుకొని ఈనెల 21న జరిగే జాయింట్ మీటింగ్ నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్లు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ నాయకులు గంగాధర, భాస్కర రావు తదితరులు హాజరైనారు.

పాడైపోయినా పట్టించుకోరా ?

మూలకు చేరిన లక్షల విలువ చేసే సామగ్రి

ప్రజాశక్తి - వీరఘట్టం

తాము తలదాచుకొనేందుకు స్థలంలేక ఇబ్బందులు పడుతుంటే, దీనికి తోడు అదనంగా సామాగ్రిని కూడా అంటగట్టడంతో నానా అవస్థలు పడుతున్నారు మండలంలోని సచివాలయ సిబ్బంది. పలుచోట్ల భద్రపర్చేందుకు స్థలం లేకపోవడంతో లక్షల రూపాయల విలువ చేసే సామగ్రి తుప్పుపట్టిపోతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని 24 సచివాలయాలకు లక్షలాది రూపాయలు వెచ్చించి బీరువాలు, టేబులు, కుర్చీలు, స్టేషనరీకి సంబంధించిన సామాగ్రిని కొనుగోలు చేసి అప్పట్లో పంపిణీ చేశారు. అయితూ ఈ సామగ్రిని భద్రపర్చుకొనేందుకు భవన సదుపాయం లేకపోవడంతో మండలానికి సంబంధించిన బీరువాలన్నీ స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని ఓ గదిలో భద్రం చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో మండలంలో ఎక్కడా సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో లక్షలాది విలువ చేసే బీరువాలు మూలన పడి ములుగుతున్నాయి. ప్రస్తుతం జిల్లాపరిషత్ పాఠశాల భవనం కూడా శిథిలావ్యవస్థకు చేరుకోవడంతో వర్షపు నీరు కారడం వల్ల బీరువాలకు పింపురు పట్టే అవకాశం ఎక్కువగా ఉంది. గ్రామాల్లో పంచాయతీ భవనాలు ఉన్నప్పటికీ చెప్పుకోవడానికే తప్ప అవి ఎందుకూ పనికిరావడంలేదు. ఎందుకంటే అప్పట్లో నిర్మించిన చిన్న చిన్న భవనాలు ప్రస్తుత సచివాలయ సిబ్బందికి సరిపడడంలేదు. మండలంలోని తెట్టంగి, చిదిమి, నడిమికెళ్ల, కిమ్మి, తూడి గ్రామాల్లో సచివాలయాల భవనాలు మిగిలిన గ్రామాల్లో భవనాలు పూర్తి కాకపోవడంతో అర్థాంతరంగా పడి ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం సచివాలయాల భవనాల నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడంతో బీరువాలు తీసుకువెళ్లందుకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రూ. లక్షలు విలువ చేసి సచివాలయ సామగ్రి పాడవ్వకపోక ముందే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న బీరువాలు

స్కూల్ గేమ్స్ సెక్రెటరీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

పార్వతీపురం రూరల్ : జిల్లాలో స్కూల్ గేమ్స్ సెక్రెటరీ పోస్ట్‌కు అర్హత గల వారి నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఫిజికల్ డైరెక్టర్లు) పోస్టులో పని చేయుచున్న జిల్లాలో గల ప్రభుత్వ/ జెడ్పీ యాజమాన్యంలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఫీజికల్ డైరెక్టర్లు) ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తు కోరుతున్నామని ఆ ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ సెక్రటరీగా రెండేళ్ల పదవీకాలం ఉంటుందని, సీనియర్ ఉత్సాహవంతులైన స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్లు, పాఠశాల విద్య వారు అర్హులని, ప్రభుత్వ/ జిల్లా పరిషత్ యాజమాన్యంలో పని చేసి ఉండాలన్నారు. రెండేళ్లలో ఉద్యోగ విరమణ పొందనున్న ఉపాధ్యాయులు దీనికి అనర్హులని, రెండు, మూడు మాసంలో ప్రమోషన్ పొందగోరు ఉపాధ్యాయులు అనర్హులన్నారు. గతంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీగా పని చేయకూడదని, ఉపాధ్యాయులపై ఎటువంటి క్రమ శిక్షణ చర్యలు ఉండకూడదని పేర్కొన్నారు. పైన తెలిపిన నిబంధనల మేరకు ఈనెల 19లోగా ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ డిఇఒ కౌంటర్ సైన్‌తో కార్యాలయం పనిదినాల్లో డిఇఒ వారి కార్యాలయంలో సమర్పించాలని ఆ ప్రకటనలో కోరారు

ఓటు వేయలేదనే కక్షతో పేదలపై ఫిర్యాదు

- బడా బాబుల ఆక్రమణలు అధికారులకు కనిపించలేదా ?
- వ్యకాస నాయకులు గంగునాయుడు

ప్రజాశక్తి - మక్కువ

ఓటు వేయలేదని కక్షతో మండలంలోని తూరుమామిడిలో మంగళవారం పేదలు, వృత్తిదారుల కట్టుకున్న ఇళ్లు కూల్చడానికి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే చేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు విమర్శించారు. తూరుమామిడిలో 1994లో సోషల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో సర్వే నెంబర్ 71 లో సుమారు 4 ఎకరాల భూమిని బూరాడ అప్పల స్వామి వద్ద ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేశారన్నారు. 1995లో చీపురు మహాలక్ష్మి, బొద్దాన పైడమ్మకు పట్టాలివ్వగా ఆ తర్వాత బొద్దాన గంగ, బొద్దాన రాజేశ్వరి, బొద్దాన లక్ష్మి, బొద్దాన గంగ, బొద్దా న సింహాచలం ఆ స్థలం లో పట్టాలు ఇచ్చారని తెలిపారు. అప్పట్లో కొంతమంది నిర్మాణాలు చేపట్టుకున్నారన్నారు. పేదలకు పట్టాలిచ్చిన తర్వాత ఇరిగేషన్ శాఖకు కొంత భూమిని రెవెన్యూ అధికారులు 1996లో బదిలీ చేశారని, అప్పటికే పేదలు కాలువ మినహాయించి ఇళ్లు కట్టుకోగా ఇప్పుడు ఆ ఇళ్లు కాలువపై ఉన్నాయని తొలగించేందుకు గ్రామ సర్పంచు రెడ్డి కృష్ణం నాయుడు కక్షగట్టారన్నారు. అప్పట్లో పంచాయితీ ఎన్నికల్లో ఓట్లు వేయలేదన్న కారణంతో పేదలపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. విఆర్ఎస్ కాలువ నీటికి ఎటువంటి ఆటంకం లేక పోయినా సర్పంచ్ పేదల ఇళ్లు కూల్చాలనే కక్షతో సర్వేలు చేయిస్తున్నారని అన్నారు.

ఇదిలాఉండగా తూరుమామిడిలో జగనన్న కాలనీ పేరుతో సేకరించిన ఇళ్ల స్థలాల్లో సర్పంచ్ పలు అక్రమాలకు పాల్పడ్డాడరన్నారు. తూరుమామిడి రెవెన్యూలో సర్వే నెంబర్ 45/2, 47ల్లో ఎకరాల 39సెంట్ల భూమిని గ్రామానికి సంబంధించిన యోగిరెడ్డి పాపినాయుడు, మచ్చ అప్పలస్వామి, గంట నారాయణమ్మ వారి కుటుంబ సభ్యుల పేరున ఎస్‌ఎఫ్‌ఎలో ఉన్న భూమిని సర్పంచ్ తన కుటుంబ సభ్యుల పేరున రికార్డులు ట్యాంపరింగ్ చేయించి రెవెన్యూ అధికారులను మోసగించి డబ్బులు తీసుకున్నాడని, వీటిపై అనేకసార్లు రెవెన్యూ అధికారులకు సర్పంచ్‌పై క్రిమినల్ కేసులు పెట్టాలని ఫిర్యాదు చేసినప్పటికీ అప్పట్లో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో కృష్ణంనాయుడు కేసుల్లేకుండా బయటపడ్డాడని తెలిపారు. ఇప్పుడు మళ్లీ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తన అక్రమాలు బయటపడతాయని తెలిసి ప్రస్తుతం టిడిపితో అంట కాగుతున్నారని విమర్శించారు. జగనన్న కాలనీలో పలు అక్రమాలకు పాల్పడిన సర్పంచి కృష్ణంనాయుడుపై సమగ్ర దర్యాప్తు జరిపించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని టిడిపి నాయకులను, రెవెన్యూ అధికారులను కోరారు. తూరుమామిడిలో పేదలు కట్టుకున్న ఇళ్లకు కృష్ణం నాయుడు నుండి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అధికారులకు ఈ అక్రమాలు కనిపించలేదా?

రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు తూరుమామిడిలో పేదలు కట్టుకున్న ఇళ్లే కనిపించాయా అని ప్రశ్నించారు? మక్కువ మండల కేంద్రంలో మెయిన్ రోడ్డులో గల బైరి సాగరానికి ఆనుకొని కేవలం 7 సెంట్లు మాత్రమే జిరాయిటి భూమి ఉందని, సుమారు 19 ఎకరాలు ఉన్న బైరిసాగరం చెరువు ఆక్రమణకు గురైందన్నారు. ఈ సాగరంలో పెద్ద పెద్ద భవంతులు, హెూటళ్లు, కిరాణా మాల్స్, మెడికల్ షాపు లు వున్నాయని వీటిపై అనేక మంది అనేక సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వున్నారని విమర్శించారు. అలాగే వెంగళరాయ సాగర్ ప్రాజెక్ట్ గట్టు దిగువన విఆర్ఎస్ కోసం సేకరించిన భూమిలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు పెద్ద పెద్ద భవంతులు, ఇళ్లు కట్టుకున్నారని, వాటిపై కూడా ఫిర్యాదులు వెళ్లాయని, కానీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు, వెంగళరాయసాగర్, ఆర్ఎంసి పరిధిలో 9 ఎల్ కాలువ, మేళాపు వలస కాలనీ వద్ద పూర్తిగా ఆక్రమణకు గురైన ఇళ్లు కట్టుకున్నారని అన్నారు. అలాగే ఆర్‌బిసిలో 13 ఎల్ కాలువ కొండ బుచ్చమ్మ పేట వద్ద పూర్తిగా ఆక్రమణ కు గురైందని, వీటి అన్నింటిపై ఎటువంటి చర్యలు లేకుండా కేవలం తూరు మామిడిలో పేదలు, వృత్తిదారుల ఇళ్లు కూల్చడానికి ప్రయత్నించడమంటే పేదలపై కక్ష తీర్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్న సర్పంచ్ కృష్ణంనాయుడు కు అధికారులు సహకరించ డమేనని అన్నారు. ఇప్పటికైనా తూరుమామిడి జగనన్న కాలనీ కొనుగోలుపై సమగ్ర దర్యాప్తు జరిపించి, ఇతరుల భూములు తన పేరున మార్చు కొని రెవిన్యూ అధికారులను మోసగించిన కృష్ణంనాయుడు పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, తూరుమామిడిలో పేదలు కట్టుకున్న ఇళ్లకు రక్షణ కల్పించాలని రెవెన్యూ అధికారులను కోరారు. లేకుంటే పేదలందరినీ కదిలించి ఉద్యమిస్తామని అన్నారు.

పేదలు నిర్మించుకున్న ఇళ్లను సర్వే చేస్తున్న అధికారులు

సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామపంచాయతీల్లో ఉండే చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేసి గ్రామాల్లో పారిశుధ్యం తొలగించే చర్యలు చేపట్టడంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల గౌరవ వేతనాలు స్వచ్ఛభారత్ నుండి నేరుగా ఇచ్చేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తుందన్నారు. గ్రామాల్లో ఆరోగ్యం కాపాడేందుకు సర్పంచులు, కార్యదర్శుల భాగస్వామ్యంతో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల ముందు విచ్చేసిన ఎంపిడిఒలను ప్రభుత్వం బదిలీ చేయడంతో ఇంతవరకు ఎంపిడిఒగా పని చేసిన ఎం.ఈశ్వరరావును ఎంఎల్ఎ దుశ్శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, ఇఒపిఆర్‌డి కుమార్ వర్మ, టిడిపి నాయకులు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : చెత్తను సంపదగా మార్చుకొని ఆదాయం పెంచుకోవాలని ఎంపిడిఒ అకిబ్ జావేద్ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్తు సమావేశ భవనంలో సర్పంచులకు, పంచాయితీ కార్యదర్శులకు శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, జిపిడిపి, స్క్రూట్నీ, వీధి దీపాల నిర్వహణ మొదలగు అంశాలపై జరుగుతున్న మూడు రోజులు శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం మండలంలోని పెద్ద బొండపల్లి సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రంలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో చెత్తను సంపదగా మార్చుకొనే విధానంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయితీలకు గాను 19 పంచాయితీల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రాలున్నప్పటికీ గత ఐదేళ్లుగా వాటిని నిర్వీర్యం చేశారని, ఇకపై వీటిని వినియోగంలోకి తీసుకొచ్చి గ్రామంలో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తడి, పొడి చెత్తను స్వీకరించి, వాటి ద్వారా వర్మీ కంపోస్టు, ప్లాస్టిక్ ఉత్పత్తుల నిర్వహణ ద్వారా పంచాయితీలకు ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు, గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహించి పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, ఇఒపిఆర్‌డి రమణమూర్తి, పలువురు సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతంపేట : సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి రాంప్రసాద్ అన్నారు. స్థానిక వైటిసిలో మంగళవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ రాంప్రసాద్ మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయతీ రాజ్ చట్టాలు బాధ్యతలు విధులు గురించి అందరికీ తెలిసి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, డిపిఆర్‌సి రిసోర్స్ పర్సన్ కన్నబాబు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : ఉత్తమ పంచాయతీలకై సర్పంచులు పాటుపడాలని ఎంపిడిఒ పి. శ్రీనివాసరావు తెలిపారు మండలంలోని 31 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు రెండో రోజు శిక్షణ మంగళవారం నిర్వహించారు. పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, విద్యుత్తు, పొడి తడి చెత్త నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారు చేయు షెడ్లను పరిశీలించారు.

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు కీలకమని ఎంపిడిఒ పైల సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం పారిశుధ్యం, జిపిడిపి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, పంచాయతీల్లో ఎల్ ఈ డి లైట్లు నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని సర్పంచులు, పంచాయతీకార్యదర్శులతో పాటు ఇతర అధికారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, ఎఒ అర్జునరావు, సర్పంచులు కలిశెట్టి ఇందుమతి, బొంతాడ మహేశ్వరరావు (మహేష్), బోను చంద్రినాయుడు, ముడిలి దుర్గాప్రసాదరావు, ద్వారపురెడ్డి గంగమ్మ, రాయల పోలమ్మ, ఎపిఒ మండల గౌరీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ఎంపిడిఒలకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిడిఒ ఎవిబి సుబ్రహ్మణ్యంకు సిబ్బంది ఘన వీడ్కోలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా విజయనగరం జిల్లా దత్తిరాజేరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో యథావిధిగా దత్తిరాజేరుకు బదిలీపై వెళ్లడంతో సిబ్బంది ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ జెఇ డి కళ్యాణచక్రి, సీనియర్ జూనియర్ సహాయకులు నాగభూషణరావు, సూర్యనారాయణ, టైపిస్ట్ సంజీవరావు, కిషోర్, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక ఎంపిడిఒ ఈశ్వరరావు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ కావడంతో ఆయన్ను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వచ్చిన ఆయనకు మండల ప్రజలు, ఉద్యోగులు సహకారంతో అనేక కార్యక్రమాలు చేపట్టాన్నారు. అందరి సహాయ సహకారాలు అందించారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు, ఎఒ ఎంఎల్ఎస్ ప్రసాద్, ఇఒపిఆర్డి కెకె వర్మ, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో భాగంగా బదిలీపై వచ్చిన ఎంపిడిఒ పైల సూర్యనారాయణ తిరిగి శ్రీకాకుళం జిల్లా బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో ఆయన్ను మండల సర్పంచులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల సర్పంచులు బొంతాడ మహేశ్వరరావు (మహేష్), ముడిలి దుర్గాప్రసాదరావు, కలిశెట్టి ఇంద మతి, ద్వారపురెడ్డి గంగమ్మ, రాయల పోలమ్మ, ఇఒపిఆర్డి ఎల్.గోపాలరావులు, ఎఒ అర్జునరావు, సిబ్బంది ఉన్నారు.

బలిజిపేట: బదిలీపై వెళ్తున్న ఎంపిడిఒ రమేష్ నాయుడును ఎంఇఒ సామల సింహాచలం దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ గడచిన సాధారణ ఎన్నికల సమయంలో రమేష్ నాయుడు మండల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు.

సాలూరు ఎంపిడిఒ ఫణీంద్రకుమార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

సాలూరు: ఎన్నికల ముందు ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన ఫణీంద్ర కుమార్ తిరిగి తన సొంత జిల్లా కి బదిలీ అయిన నేపథ్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.కార్యాలయం సూపరింటెండెంట్ జి.పార్వతి, సీనియర్ అసిస్టెంట్ రమణమూర్తి,ఇతర సిబ్బంది ఆయన సేవలను కొనియాడారు.నాలుగు నెలలు గా విధి నిర్వహణలో ఆయన అందరి మన్ననలు పొందారని ప్రశంసించారు.

ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న విఆర్ఎ సంఘ నాయకులు

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

విఆర్ఎ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ సంఘ నాయకులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, మంత్రులతో కార్యక్రమం లో భాగంగా మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా తమకు వేస్తున్న నైట్ డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, తెలంగాణలో అమలవుతున్న విధంగా విఆర్ఎల పేస్కేలు అమలు చేయాలని, జిల్లాలో గల విఆర్ఎ వాచ్మెన్, అటెండర్, రికార్డ్ సహాయకుడు ఖాళీ పోస్టులను తక్షణమే విఆర్ఎలకు ప్రమోషన్ ఇచ్చి భర్తీ చేయాలని కోరారు. నామినీలుగా పనిచేస్తున్న విఆర్ఎను గుర్తించాలని, విఆర్ఎలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఆయన స్పందించి త్వరలోనే ఈ సమస్యను ముఖ్యమంత్రి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఎ సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జి.కృష్ణారావు, మండల అధ్యక్ష కార్యదర్శులు కె.సుధ, శ్రీను, బాబూరావు, విజయ్, ఎన్.కృష్ణ, బి.దిలీప్, పుష్ప పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సిడిపిఒ అనంతలక్ష్మి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : సిడిపిఒ

ప్రజాశక్తి - పాచిపెంట

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమనిఐసిడిఎస్ సిడిపిఒ బి.అనంతలక్ష్మి అన్నారు. ఆడపిల్లలను రక్షిద్దాం ఆడపిల్లలను చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సరాయివలస ఏకలవ్య బాలికల పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు జరిపిస్తే చట్టరీత్యా శిక్ష అర్హులని, అలాగే బాల్యవివాహాల వల్ల జరిగే అనార్థాలు, ఆడపిల్ల అవశ్యకత, విద్య, ఆరోగ్యం, రక్షణ, అభివృద్ధి, వ్యక్తిగత పరిశుభ్రత మొదలుగా అంశాల గురించి బాలికలకు అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్, అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తున్న వాహనాలను సీజ్ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని మంగళవారం ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఆర్‌టిఒ శశి కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో గల అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు, బస్సులు, క్యాబులు, ఆటోలు వంటి వాహనాల్లో విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించడంవల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యాన్లు , ఆటో, బస్సులు నడుపుతున్న డ్రైవర్లకు ప్రభుత్వం ద్వారా పొందిన లైసెన్సు అనుమతుల్లేకపోవడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల విద్యార్థుల ప్రాణాలకే ముప్పందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న వారిపైనా, నడిపిస్తున్న యాజమాన్యాలపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వికాస్ తదితరులు పాల్గొన్నారు.

పశుసంపదతోనే రైతుల ఆర్థిక అభివృద్ధి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు వ్యవసాయంతో పాటు వారి ఆర్థిక అవసరాలకు పశుసంపద ఎంతో మేలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ ఎన్.మునికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన సచివాలయ పశుసంవర్ధక సహాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పశుపోషణకు రైతులు అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు గోశాలలను మంజూరు చేస్తుందని, అవసరమైన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే ప్రతి ఐదేళ్లకొకసారి పశుగణన జరుగుతోందని అందులో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటి నుండి అక్టోబర్ 31 వరకు జరపాలని సూచించారు. కార్యక్రమంలో 25 మంది వరకు సచివాలయ వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్‌లో మంగళవారం ఎస్సై ఎం.రాజేష్ వాహనాలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పెండింగ్ కేసులన్నీ క్లియర్ చేస్తామన్నారు. అలాగే ప్రతి వాహనదారుడు తప్పక వాహన పత్రాలు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై అన్నారు. మండలంలోని ప్రతిభ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పానీయాలకు, గంజాయికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఆడపిల్ల పట్ల అసభ్యంగా ప్రవర్తించరాదన్నారు. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ప్రయివేటు పాఠశాలల బస్సులను మంగళవారం ఎంవిఐ జెవివి ప్రసాద్ తనిఖీ చేశారు. నిబంధనల మేరకు బస్సులు కండిషన్‌లో వున్నాయా లేవా? అన్ని రకాల పత్రాలు వున్నాయా లేవా అని పరిశీలించారు. వాహనాల్లో పరిమితి కి మించి పిల్లలను తరలించరాదని, ఆర్సీ, ఎఫ్ సి, ఇతర డాక్యుమెంట్లు కలిగి వుండాలని సూచించారు. ప్రతి స్కూల్ బస్ లో అటెండెంట్ తప్పనిసరిగా వుండాలని నిర్వాహకులకు చెప్పారు.

కొబ్బరి మొక్కలు నాటిన సర్పంచ్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్‌కు ఉపాధి హామీ ద్వారా ఇచ్చిన కొబ్బరి మొక్కలను సర్పంచ్ ఐ.గౌరీశంకర్ తరినాయుడు చెరువు గట్టుపై మంగళవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి సాగు ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కావున ఉపాధి హామీ ద్వారా ఇటువంటి మొక్కలు ప్రతి రైతుకు అందజేస్తే వారు ఆర్థికంగా కొంత అభివద్ధి చెందుతారని అన్నారు. కార్యక్రమంలో నీలకంఠాపురం సర్పంచ్ ఎ.మన్మధరావు , ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీహరి, రాజేశ్వరి పాల్గొన్నారు.

నడుకూరులో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరులో మంగళవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర పీడితులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే వివిధ రకాలైన రోగులకు కూడా తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల కళాశాలల్లో మిగులు సీట్లు భర్తీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలికల కళాశాలలో మిగిలిన సీట్లకు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నె దొర ఆధ్వర్యంలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మెరిట్ ప్రాతిపదికన ఎంపిసి, బైపిసి, సిఇసి గ్రూపులకు చెందిన 30 సీట్లు భర్తీ చేసినట్లు డిడి తెలిపారు. ఈ కౌన్సెలింగ్లో ప్రిన్సిపల్ సూర్యకుమారి, సూపరింటెండెంట్ వెంకటరమణ, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

చక్కగా చదువుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని స్థానిక ఎస్ఐ ఎస్ ఫక్రుద్దీన్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని గంగంపేట గిరిజన సంక్షేమ ఉన్నత ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని, విద్యపై దృష్టి పెట్టాలన్నారు. నషాముక్త భారత్ అభియాన్ భాగంలో యువత మత్తు పదార్థాల నిర్మూలన రాష్ట్రంగా తయారు చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం సరికాదు

ప్రజాశక్తి -కొమరాడ

మండలంలోని జల గ్రామంలో గల జిపిఎస్ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. అయినా అధికారులు ఈ భవనంలోనే తరగతులను నిర్వహిస్తున్నారని, ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. జల గ్రామంలో గల జిపిఎస్ పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. గిరిజన విద్యార్థులు చదువుతున్న ఈ భవనంలో వారికి రక్షణ లేకుండా ఏ రోజు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఈ పాఠశాలలో మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 20 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. రేకులతో నిర్మించడం వల్ల ఆ రేకులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, అలాగే గోడలు కూడి పూర్తిగా వర్షాలకు శిథిలావస్థకు చేరడంతో ఎండకు, వానకు, గాలులకు పిల్లలు చదువుకోలేక భయపడి ఇంటికి వెళ్లే పరిస్థితి ఉందని తెలిపారు. ఈ విషయం పైన గతంలో కలెక్టర్ గ్రీవెన్స్ ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న ఈ పాఠశాలను కొత్త భవనాలు నిర్మించి గిరిజన విద్యార్థులకు భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివున్నాయుడు, గ్రామానికి గిరిజన నాయకులు చెంబరు నాగేశ్వరరావు, నాగ పాల్గొన్నారు.

శిథిల భవనంలో చదువుతున్న చిన్నారులు

టిడిపివి అర్థం లేని ఆరోపణలు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ పాలకవర్గంలో గ్రూపు రాజకీయాల గురించి టిడిపి కౌన్సిలర్లు చేసిన ఆరోపణలు అర్థరహితమని వైసిపి పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు అన్నారు. మంగళవారం వారు కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడేళ్లుగా మున్సిపల్ సమావేశాల్లో ఏనాడూ ప్రజా సమస్యలపై నోరు మెదపని టిడిపి కౌన్సిలర్లకు తమ పార్టీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. తాము అధికార పక్షానికి చెందిన కౌన్సిలర్లమైనా ప్రజా సమస్యలపై గళమెత్తామని, అధికారులు చేసిన అవినీతి, అక్రమాలను ఎత్తి చూపామని చెప్పారు. మున్సిపాలిటీలో నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులు వారం రోజుల్లో చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అధికారులను ఆదేశించారని, ఇంతవరకు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ నుంచి నిధులు తీసుకొచ్చి మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేపడతామని చెప్పి రెండు నెలలు కావస్తోందని చెప్పారు. మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.36లక్షలు మంజూరు చేసిందని, ఈ నిధులతో పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేయాలని టిడిపి నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ నిధులు మంజూరైనట్లు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకే సమాచారం రాలేదని, వాటి వినియోగానికి సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు జారీ కాలేదని అధికారులు చెబుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎవరు ఏ నిధులు తీసుకొచ్చినా తాము సహకరిస్తామని వారు చెప్పారు.

ఎఫ్‌పిఒ ద్వారా పంట కొనుగోలు : ఎడిఎ

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా పండించే పంటను కొనుగోలు చేయనున్నట్టు పాలకొండ ఎడిఎ కె.రత్నకుమారి రైతులకు సూచించారు. మండలం చలివేంద్రిలో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నానో యూరియా, డిఎపి ఉపయోగించు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. అంతేకాక ఇదివరకు చేసిన పొలంబడి కార్యక్రమం కన్నా జిఎపి పొలంబడిలో రైతు పండించే ధాన్యానికి ఎపిఎస్ఒసిఎ సమస్థ ద్వారా గుర్తింపు ఇస్తున్నామని స్పష్టం చేశారు. సీతంపేట వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ ఎన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ సమయంలో పంటలు వుడిచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాధారణ ఎరువుల కన్నా ప్రత్యామ్నాయంగా నానో యూరియా, డిఎపి వాడకంలో మెళకువలు, పంట చీడపీడలు ఆశించకుండా నిమో ఆయిల్ స్ప్రేయింగ్ లీఫ్ క్లిప్పింగ్ నాట్లు వేసే విధానాలపై రైతులకు సూచించారు. అనంతరం పొలంలోకి వెళ్లి నాట్లును పరిశీలించి, సరైన విధానాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి జె.సౌజన్య, ఎఇఒ బి.కృష్ణకాంత్, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ పేరిట రాజకీయాలు తగదు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారంటూ ఆయన పేరుతో రాజకీయాలు చేయడం వైసిపికి తగదనిమాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ 125వ శతజయంతి ఉత్సవాలు సందర్భంగా ఆయన పేరిట 100 ఎకరాలు కేటాయించి స్మృతి వనం నిర్మించేందుకు చంద్రబాబు నిధులు కేటాయిస్తే, హడావిడిగా విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించి, ఆయన పాదాల కింద పెద్దపెద్ద అక్షరాలతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేర్లు రాయించుకోవడం కొంతమంది దళితులు వ్యతిరేకించారన్నారు. అసలు దళిత వ్యతిరేకి జగన్మోహన్ రెడ్డి అని, అంబేద్కర్ పేరిట ఉన్న ఓవర్సీస్ ఎడ్యుకేషన్ పథకాన్ని రద్దుచేసి జగన్ పేరును ఆ పథకానికి తగిలించి ఆ పథకం నిర్వహణ అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. అలాగే ఎంతో మంది దళితులను వైసిపి అవమానించిందని, హత్యలు చేసిన వారిని పక్కన పెట్టుకుని తిప్పుతున్న జగన్మోహన్ రెడ్డి అంబేద్కర్‌ను ఇలా అవమానపర్చడం మానుకోవాలని హితవు పలికారు.

రోడ్డును ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రజలందరికీ ఉపయోగపడే రహదారిని ఆక్రమించుకొని దారి ఇవ్వకుండా అడ్డుపడుతున్న మతల విధిష్టరావుపై చర్యలు తీసుకొని తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని మండలంలోని కోటికిపెంట పంచాయితీ కొత్తవలస గ్రామస్తులు తహశీల్దార్ రవికి వినతిని అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షులు మాదిరెడ్డి తిరుపతినాయుడు స్థానిక ప్రజలు గండి అచ్యుతరావు, కోడి రామకృష్ణ, పాలాడ తిరుపతిరావు, బొంగు కృష్ణ, రావాడ రవి, మాదిరెడ్డి నాగరాజు, రావాడ సంతోష్ కుమార్ మాట్లాడుతూ 50 ఏళ్లుగా తమకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ప్రజలంతా నడిచే ఈ రహదారిని అడ్డుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే 1983లో బీసీ కాలనీ ఏర్పాటు చేసినప్పటి నుంచి దాదాపు 80 కుటుంబాలకు పైగా ఉన్న ప్రజలంతా ఇదే తోవలో నడుచుకొని నిత్యం అదే దారి గుండా ఉంటున్నామని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలందరికీ ఇబ్బంది కలిగించేలా తమ గ్రామానికి చెందిన వ్యక్తి అడ్డుకోవడం ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. వీరికి మాజీ ఎంపిపి పిన్నింటి ప్రసాద్ బాబు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, రైతు సంఘం కార్యదర్శి బోను గౌర్నాయుడు మద్దతు తెలిపారు. అనంతరం తహశీల్దార్ స్పందించి వెంటనే స్థల పరిశీలన చేసి రోడ్డు సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తానని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రజాదర్బాల్లో సీతానగరం, పార్వతీపురం, బలిజిపేట మండలాలకు చెందిన పలు గ్రామాల నుంచి ప్రజలు వినతి పత్రాలు అందజేశారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా ఆలకించి సంబంధిత అధికారులకు ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే చర్యలు చేపట్టాలని సంబంధించిన అధికారులను కోరారు. దీర్ఘకాలిక సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు.

గరుగుబిల్లి భారీ ర్యాలీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

దేశవ్యాప్తంగా ఈనెల 9 నుంచి 15 వరకు చేపట్టిన హర్‌ఘర్ తిరంగా కార్య క్రమంలో భాగంగా మండలంలోని శ్రీ సాయి నికేతన్ హై స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

29వ రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలోని భూ సమస్యలు పరిష్కరించాలని, గరుగుబిల్లి మండలం శివ్వాం దళితులకు న్యాయం చేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాధితులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 29వ రోజు కొనసాగాయి. మంగళవారం జరిగిన దీక్షలలో కురుపాం మండలం గిరిజన సంఘం నాయకులు పాల్గొని తమ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుపాం మండలంలో రెండేళ్ల క్రితం జరిపిన సర్వే ప్రకారం డి పట్టా భూమికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరంకలెక్టర్ కార్యాలయంలో వినతి అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మండంగి శ్రీనివాసరావు, మండంగి ఇండియా, మండల నాయకులు పత్తిక మోహన్ కీలక కనకారావు మండంగి చిన్నారావ్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరంలో పాల్గొన్న గిరిజన సంఘం నాయకులు

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొండ

రహదారి భద్రత వారోత్సవాలు సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో రహదారి భద్రత గురించిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాలేజీ ప్రిన్సిపల్ హరగోపాల్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఎంవిఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. అలా నడుపుతూ పట్టుబడినా, ప్రమాదాలు చేసినా, ఆ మైనర్‌తో పాటు వాహన యజమానికి మూడు నెలల కఠిన కారా గార శిక్ష, రూ.3వేలు వరకు జరిమానా, వాహనాన్ని జప్తు చేస్తామని తెలిపారు. మత్తు పదార్థాలు స్వీకరించి వాహనం నడపరాదని, శిరస్త్రాణం లేకుండా వాహనం నడపడం ప్రమాదకరమని, మితిమీరిన వేగంతో వాహనం నడిపినా, అధిక లోడుతో వాహనం నడిపినా ప్రమాదకరమని వివరించారు. మెడికల్ ఆఫీసర్ నారాయణరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన వెంటనే తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎజిఎంఒ పైల శంకర్రావు, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, జి గోవిందరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వేప గింజల కషాయంతో పురుగుల నివారణ

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రస్తుతం పత్తి పంటపై రసం పీల్చు పురుగులు ఆశించాయని, రాబోయే రోజుల్లో గులాబీ రంగు కాయ తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉందని దీని నివారణకు వేపగింజల కషాయం ఉపయోగపడుతుందని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు సూచించారు. మండలంలోని గురువునాయుడుపేటలో సాగువుతున్న పత్తిపంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురుగుల ఉధృతి తగ్గించాలంటే గుడ్డిదశలోనే నివారణ చర్యలు చేపట్టాలని, గుడ్డి దశలోనే పురుగుల నివారణకు ఐదు శాతం వేప గింజల కషాయం ఎంతగానో ఉపకరిస్తుందని సచించారు. రసాయనాలు పిచికారీ చేయకుండా వేప సంబంధిత మందులైన నీమాస్త్రం, వేప గింజల కషాయం, బ్రహ్మాస్త్రం, పంచ పత్ర కషాయం, దశపర్ణి కషాయం వంటి ద్రావకాలను వినియోగించి పురుగులను నివారించుకోవచ్చని తెలిపారు. దీనివల్ల భూమి ఆరోగ్యం పాడవ్వకుండా ఉండడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతూ శత్రు పురుగులను నివారించవచ్చని తెలిపారు. అలాగే పత్తి పంటలో అంతర పంటల మోడల్ ను సిద్ధం చేస్తూ రైతులకు ఐదు శాతం వేప గింజల కషాయం తయారీని వివరించారు. పత్తి చుట్టూ రెండు వరుసల్లో జొన్న లేదా మొక్కజొన్న, గట్లపై ఆముదాలు, కూరగాయలు వేసుకుని అంతర్ పంటగా కంది, పెసర, మినుము వంటి అపరాలను వేసుకున్నట్లయితే మిత్ర పురుగుల సంఖ్య పెరిగి చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని, ఖర్చు తగ్గి అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. అంతేకాకుండా భూమిలోని తేమ సద్వినియోగపడి జీవ వైవిధ్యం పెరిగి ప్రధాన పంటకు పోషకాలు అందిస్తుందన్నారు. కావున రైతులు ఏక పంట విధానాన్ని విడనాడి పలుపంటల విధానం వైపు మళ్లాలని సూచించారు. అనంతరం వేప గింజల కషాయం తయారీని రైతులకు వివరించారు. కార్యక్రమంలో విఎఎ గణేష్, ప్రకృతి సేద్య ప్రతినిధులు సూర్యారావు, సుకరమ్మ, గ్రామ పెద్దలు ధనుంజయరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి మేలు

సాలూరురూరల్ : ప్రకృతి వ్యవసాయం మానవ ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరంగా, ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయధికారి అనురాధ పండా తెలిపారు. మండలంలోని మరిపల్లిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి ఎటిఎం పద్ధతిలో కూరగాయలు పండించే విధానాన్ని స్థానిక రైతులకు మంగళవారం వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటిఎం మోడల్ వల్ల అన్ని రకాల కాయకూరలు, ఆకుకూరలు, తీగ, దుంప జాతి సాగు చేయొచ్చునన్నారు. దీని ద్వారా రైతులు మంచి ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఎటిఎం పద్ధతి వేసే విధానాన్ని రైతులకు వేసి చూపించారు. అందరూ ఆరోగ్యాంగా ఉండాలంటే విషరసాయన ఆహారపదార్థాలు తినకూడదని, రసాయన ఎరువులు వాడడం వల్ల భూమిలో సారవంతం పాడూ భూమి విషతల్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో మరిపల్లి ఆర్ఎస్‌కెవిహెచ్ ఎ.నురానీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాలూరు : ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కల్పిస్తున్న ఎఒ అనురాధపండా

శానిటేషన్ సిబ్బందిపై వివక్ష ఆపాలి

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

ప్రభుత్వ వైద్య సంస్థల్లో పనిచేస్తున్న పారిశుధ్యం, భద్రతా, చెదపురుగు నివారణ సిబ్బందికి జరుగుతున్న వివక్షను ఆపాలని, కాంట్రాక్టు లేబరు (రెగ్యులేషన్, అబాలిశన్) యాక్ట్ 1970, ఎపి రూల్స్ 1971, మన ప్రభుత్వ ఎపి న్యూ సైంటిఫిక్ శానిటేషన్ పాలసీ 2015 ప్రకారం జీతాలు చెల్లింపు చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు శానిటేషన్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆసుపత్రులు 222 మంది కార్మికులు ఉన్నారని, తాము టివిటి గ్రూపు ఏజెన్సీలో పని చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్య సంస్థలైన వైద్య కళాశాలలు, భోదనా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో పారిశుధ్యం, భద్రతా, చెద పురుగుల నివారణ నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల అరాచాకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మూడునెలలకొకసారి జీతాలు చెల్లింపులు, పిఎఫ్ బకాయి, దోపిడీలు, ఇఎస్ఐ కార్డులు అందజేయకపోవడం ఇలా కార్మికుల శ్రమ దోపిడీకి గురౌతున్నారన్నారు. ప్రతి నెలా కార్మికులకు జీతాలు చెల్లించేలా చేయాలని ఎమ్మెల్యేను కోరారు.కార్యక్రమంలో ఎఐటియుసి ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, నాయకులు సింహాద్రి దుర్గారావు, అలజంగి కుమారమ్మ, ఎం.చంద్రమౌళి, కావ్య, సుధీర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా నాటు సారా పట్టివేత

ప్రజాశక్తి - సాలూరురూరల్

పోలీసులకు అందిన సమాచారం మేరకు మండలంలోని డెన్నరాయి, దిగువ రూఢి గ్రామాల మధ్యలో గల అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కేంద్రం మీద మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 6వేల లీటర్ల పులియబెట్టిన బెల్లం ఊటలను ధ్వంసం చేసి 120 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్ఐ తెలిపారు. నిందితులు పరారీలో ఉండగా, వారిపై కేసు నమోదు చేసిన్నట్లు ఆయన తెలిపారు.